కథానిక

# సరస్వతి కథ

కుమారి కె. పత్రలేఖ

ఎవరైనా సరే అందరూ నడిచిన మార్గాన కాకుండా కొత్త మార్గాన నడవబోతే — చాలు — వింతగా చెప్పుకుంటుంది లోకం. ఆ కొత్తదారి పట్టినవ్యక్తికి ఆరోజు మొదలు మనశ్శాంతి కూడ దూరం అవుతుంది. ఏంతప్పేముంది? అందరిదారీ నాకు నచ్చకపోతే — నే క్రొత్త మార్గం వెతుక్కుంటే తప్పేముంది' — అని తనను తాను ప్రశ్నించు కుంటుందేగాని — కొద్ది రోజులకే అందరిదారికీ తన నూతన మార్గం ఆహుతి కాక తీరదు. అలా కాకుండా. తనకు వచ్చిన మార్గాన్నే నడిచే ధీమంతులు వుండి, ఎన్ని అడ్డంకులు వచ్చినా నెట్టుకుపోతే — చివరకు మిగిలేదేమిటి? ఆందోళనా, అసంతృప్తిని; అపార్థం చేసుకొన్న మానవ కోటీ, అనవసరంగా అర్థంలేని బ్రతుకు బ్రతికేశామనే నిస్పృహాను. ఇలా అంటే వేదాంత ధోరణి అంటారు. కాని యీ వేదాంత ధోరణేనా యిప్పుడెందుకు? చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్లు?- జీవితపులోతుపాతులు తెలుసుకొన్న నాడే యీ వేదాంత ధోరణి అబ్బుతుంది. సుడిగాలి చిక్కినట్లు జీవితం గడిపేస్తూంటే. చివరకి ఏంమిగులు తుందన్న ఆలోచనరాదు. ఆ చివరకి ఏంమిగల నప్పుడే — ఆ గడచిన జీవితపు విలువలేని తనం బయట పడు తుంది .... ఈ అలజడి జీవితం మీదా చివరకు ఏమి మిగలని జీవితంమీదా యిన్ని వూహాలు రావడానికి కారణం సరస్వతి. సరస్వతి పుట్టిన పుట్టుకా మెట్టిన యిల్లూ చివరకి నడిచిన జీవిత పథమూ తల్చుకుంటే — రాతగీతలలో నమ్మకం లేని నాకూ అనుమానం వేసింది: ఏదో కనబడని శక్తి ముందుకి నడిపించు కుంటూ వెళ్లనిదే వ్యక్తుల జీవితాలు ముళ్లుపడ్డ దారాలలా యిలా ఎందుకవుతాయి?

ఇదమిత్థంగా, యీసుఖాలు నాకు కావాలి. ఇలాంటి వాణ్ణి నేను ప్రేమిస్తాను, అని నిశ్చయించు కొనే వయస్సు రాకుండానే పెద్దలు సరస్వతికి వివాహం జరిపించారు. ఆంధ్ర దేశంలో చెప్పుకో తగ్గ పట్టణంలో పుట్టి పెరిగిన సరస్వతి తన పదహారో యేట పల్లెటూరి అత్తవారింట అడుగిడింది.....

కొద్ది మాసాలలోనే పల్లెటూరి మీది మోజు తగ్గింది సరస్వతికి. తననూ అడవిమనుషుల మధ్య పడేసిన విధినీ, తల్లి తండ్రులనీ తిట్టుకుంది. అసంతృప్తి, జీవిత వృక్షానికి వేరుపురుగు. పూర్తిగా నేల కొరికేదాకా విడువదు. సరస్వతి భర్తకు నివేదించింది పట్నవాసం పోదామని. భూమి పుట్రావున్న తాతలనాటి వూరు వదలి రానన్నాడు. తనను యీనరకంనుండి రక్షించమని తల్లి తండ్రులకి ఉత్తరం వ్రాసింది. అత్తవారింట పడరాని యిక్కట్లు పడుతున్నట్లు భావించారామె తల్లి తండ్రులు. తక్షణమే తమ బిడ్డని యింటికి తెచ్చుకున్నారు.

దీనికంతటికీ కారణం ఏమిటి? సరస్వతికి అసంతృప్తే. పట్న వాసంలో తాను రాణించి నట్లు సిటీ బస్సులేనా లేని యీ పల్లెటూళ్లో తాను రాణించలేను. చదువు సంధ్యలూ సంస్కృతీ మాట అటుంచితే — తాను అందగత్తె. తనమీద ఏమాత్రం అభిమానం వున్నా తనవెంట భర్త వచ్చేవాడు.

పట్నం వచ్చిన సరస్వతి పని బాగుంది. అత్తవారింట్లో అష్ట కష్టాలూ పడిన కూతురి మీద అదరణ హెచ్చింది తల్లికి. అసలే ఒకరకమైన మన స్తత్వంలో పెరిగి పెద్దదౌతూన్న సరస్వతి తెలివి యీ ఆదరణలో పెడతల పట్టింది. అస్తమానమూ ఒకటేపని: తన అందం యినుమడించేలా అలంకరించుకోవడం. ఈ వేషాలు తండ్రికి బాధగానే వున్నాయి. కాని ఏంచేస్తాడు? స్వంత కూతురు. కళ్యాణం అయి కాపరంలేని కూతురు.

తన అందం రాణించడానికి, తిరిగీ తనభర్త తనదగ్గరకి రావడానికీ, తల్లి తండ్రుల డబ్బు యిబ్బందులు తగ్గడానికీ, సర్వదా పరిష్కరణ మార్గా లన్వేషిస్తూన్న సరస్వతికి సినిమారంగం మెరుపు తీగలాగోచరించింది. అవును తను సినిమాల్లో నటించడానికి ప్రయత్నాలు చేస్తే అన్ని సమస్యలూ యిట్టే పరిష్కరింప బడతాయి. తనకి ఆత్మసంతృప్తి చేకూరు తుంది. ఈ ఆలోచన తల్లికి నచ్చింది. తనకూతురు తారకాబోతుందంటే ఆతల్లికిగర్వం

గావుంది. తండ్రి మటుకు వెధవ్వేషాలు కట్టిపెట్టి యింటి పట్టునపడివుండమన్నాడు. సరస్వతిదిఅహందెబ్బతింది యీ నాన్నకేం తెలుసు? అమ్మనిచూడు ఎలా తయారు చేశాడో? అమ్మకేముంది యీలోకంలో —— యీ అర డజను పిల్లలూ తప్ప, వీళ్లందరినీ ఎలా పోషిస్తాడు నాన్న? ఈ సంగతి ఎప్పుడేనా ఆలోచించుకున్నాడా నాన్న? లేదు. ఆ ఆలోచనే ఆయనకి రాదు. అందుకే ఎప్పుడూ యీ గుమస్తా గిరీదాటి ఆయనదృష్టి ప్రసరించలేదు. ఈ బరువు భారాన్నంతా ఎలా మోస్తాడు నాన్న? ఎన్నాళ్లు మోస్తాడు? ఈ ఊహా ప్రవాహంలో కొట్టుకుపోతున్న సరస్వతికి తనకు తోచిన మార్గం సర్వసమస్యా పరిష్కరణ మార్గంగా గోచరించింది.

ఎలాగో కష్టపడి. తమ వీధి చివరనే వున్న మేష్టారి చుట్టాల ద్వారా. మద్రాసులో ఓ ప్రముఖురాలి చిరునామా సంపాదించింది సరస్వతి. ఆవిడ పేరు శ్యామ సుందరిట. ఎవరో యీ శ్యామ సుందరి ఏ వృత్తిలో యీ సువిశాల సినిమా జగత్తులో జీవిస్తోందో ఏసంగతులూ సరస్వతికి తెలియవు. అయితేనేం —— నోట్లో నాలిక వుంటే చాలదేమిటి? .... శ్యామ సుందరిగారికి వ్రాసి తన మద్రాసు ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకుంది సరస్వతి. వచ్చే లక్ష్మీవారానికి, మద్రాసులో ఫలానా చిరునామాకి రావలసిందని శ్యామ సుందరిగారు వ్రాయించిన వుత్తరం చూసుకొని మురిసిపోయింది సరస్వతి. అమ్మకి ఉన్న రెండు బంగారు గాజులూ అమ్మి డబ్బు సమకూర్చుకుంది. తండ్రి శతవిధాల చెప్పిచూశాడు ఆ ఆలోచన విరమించుకోమని. కుటుంబ మర్యాద మంటకలప వద్దని. సినిమాలో చేరడం కుటుంబ మర్యాద మంట కల్పడం కాదు సరికదా, గత తరాలకి సహితం వన్నె సమకూర్చడం అంది. అన్నానికి యిబ్బంది పడుతూ వంశ మర్యాదను గురించి మాట్లాడ్డం హాస్యాస్పదం అంది. ఎవరేమనుకున్నా. తార కాకుండా, తిరిగి మద్రాసు నుంచి రానని నిశ్చయించుకొని లక్ష్మీవారం ముందు రోజు రైలెక్కింది సరస్వతి.

సెంట్రల్‌లో రైలు దిగేసరికి చీకటి చీకటిగా వుంది. బాగా మబ్బుపట్టి వర్షంకూడా కురుస్తూంది. ఈ మహా పట్టణంలో నా అన్నవాళ్లు లేకుండా ఎలాబ్రతకడం అన్న పిరికితనంలో ఓక్షణంపాటు లోలోన ఒణికి పోయింది. ఆ మరు క్షణాన్నే తనకి తాను ధైర్యం చెప్పుకుంది. ఈ క్షణంలో ధైర్యం చిక్కపట్టుకోకుంటే నేసాధించలేనిదంటూ వుండదు అనుకొంది. ఏంహృదయం యిది? ధైర్యంగా వుండవలసినక్షణాలలో యిలావణికిపోతుందేం? భయంచేతా? అత్యుత్సాహంచేతా?

రిక్షా బేరం చేసుకొని ఎక్కింది, కోరమీసాల ఎర్రకళ్ల రిక్షావాడు భయంకరంగా వున్నాడా చీకటి చీకటిలో. ఆలోచనలతో. ఊహాసౌధాలు కడుతూ యీ ప్రపంచంలోనే లేనట్టు కూర్చున్న సరస్వతికి రిక్షావాడి ప్రశ్నల వర్షంగుర్తే లేదు. రిక్షాలో యిలా కూర్చుని కొన్నివేల గంటలయిందనిపించింది.

"ఇంకా ఎంతదూరం? శ్యామ సుందరిగారి ఎడ్రసు నీకు బాగా తెలుసా?" అడిగింది సరస్వతి.

"సినిమాల్లో పనిచేసే శ్యామ సుందరిగారు తెలుసు. నువ్వు వెళ్లేది వారింటికా?" అడిగాడు రిక్షావాడు. ఏకవచన ప్రయోగానికి బాధపడ్డా తనకి కావలసిన వారి యిల్లు తెలిసిన రిక్షా ఎక్కినందుకు సంతోషించింది.

"ఇదిగో యీ యిల్లే నువ్వదిగినది" అని రిక్షా కిందికి దించేదాకా యిన్ని పెద్దవీధులూ వదిలి యీ చిన్న సందులోకి వచ్చానన్న సంగతి తెలియలేదు సరస్వతికి. అంతపేరు పొందిన శ్యామ సుందరి, యీ అసహ్యంగా వున్న పాత యిళ్లలో వుంటుందంటే నమ్మలేక, రాసు కొచ్చిన ఎడ్రసు కాకితం ఓసారి చూసుకొంది. పక్కనే వున్న కిళ్లీకొట్టు వాణ్ణడిగింది, అనుమానంలేదు. ఇదేవీధి. డబ్బులిచ్చి రిక్షావాణ్ణి పంపించేసింది. ఆయింటి మెట్లు ఎక్కుతూంటే సరస్వతి కాళ్లు వణికాయి. ఎలాగో ధైర్యంచేసి తలుపు తట్టింది. రెండు నిముషాలపాటు ఏంసమాధానం లేదు. రెండు నిముషాలూ రెండు యుగాలుగా తోచాయి. ప్రక్కనే వున్న కిళ్లీకొట్టువాడూ, వాడి బేరగాళ్లూ లోకం అంతా ఏకమై తననే చూస్తున్నట్లనిపించింది ఆ రెండు నిముషాల్లోనూ.

గళ్లలుంగీ, లేసు బనీను వ్యక్తి ఒకడు తలుపుతీశాడు. "ఎవరు కావాలి?" అన్నాడు కటువుగా.

'శ్యామ సుందరిగారి యిల్లు యిదేనా?' తనకి తెలియకుండనే ఒణికిన కంఠస్వరంతో అడిగింది సరస్వతి. అవును యిదే. కాని. ఆవిడ చచ్చిపోయి నాలుగు రోజులయిందే. నీకు తెలియదా? లోపలికిరా ఆవిడ అక్క వుందిలే. అంటూ దారి యిచ్చాడా గళ్లలుంగీ వ్యక్తి.

ఇంతలోకే " ఎవరూ రహమాన్ " అంటూ లోపలి గదిలోనుంచి ఒకావిడ వచ్చింది. తలనిండా తేనెపట్టులా పిన్నులు : ఉంగరాలుగా జుట్టు తిరగడానికి కాబోలు. " ఎవరమ్మాయి నువ్వు" సూటిగా సరస్వతిని ప్రశ్నించింది. " శ్యామ సుందరిగారు యీరోజుకు రమ్మని ఉత్తరం వ్రాయించారు .... సినిమాల్లో చేరదామని వచ్చాను." ధైర్యంగానే చెప్పింది సరస్వతి.

" ఓ సంగతి అమ్మాయి, మా చెల్లెలే శ్యామ సుందరి. మూడు రోజుల క్రితమే హాస్పటల్‌లో మరణించింది. అందుకే నేవచ్చి యిక్కడుంటున్నాను."

సరస్వతికి తన చుట్టూ ఏముందో తెలియడం లేదు. తను సినిమాల్లో చేరడానికి వస్తే, తనను రమ్మని ఆహ్వానించిన వ్యక్తి మూడునాళ్ల క్రితమే మరణించింది. ఈ మద్రాసులో ఎలాబ్రతుకుతుంది తను ? తన దగ్గర వున్న డబ్బు ఎన్నాళ్లు వస్తుంది ? తాను ధైర్యంగా నిల్చునివున్న భూమే బ్రద్దలయి తనని మింగేసినట్లు బాధపడింది సరస్వతి. సరస్వతి వూహలను మాటలలో చెప్పినంత విశదంగానూ గ్రహించింది శ్యామ సుందరి అక్క.

" నీకీ వూళ్లో ఎవరూ లేకుంటే యీ యింట్లో వుండవచ్చు. మెల్లి మెల్లిగా పని చూసుకోవచ్చు. రా స్నానం చేసి భోజనం చేద్దుగాని" అంటూ సరస్వతిని లోపలికి తీసుకువెళ్లింది శ్యామ సుందరి అక్క.

సరస్వతి మద్రాసు వచ్చి నెల రోజులు దాటింది. ఈ నెలలో సరస్వతి చాలా సంగతులు తెలుసుకొంది. ఈ నిజాలు ఆమె హృదయాన్ని క్షోభపెట్టాయి. శ్యామ సుందరి చావుతోపాటు తనకి ఒక ఎక్స్ట్రా అయే రాత కూడా లేకుండా పోయిందను కొంది సరస్వతి. కాని, అలా కాలేదు. రాత్రంతా తలనిండా నొక్కులు రాడానికి పిన్నులు పెట్టి, ఉదయాన్నే స్టూడియోలకి తీసుకు వెళ్లేది శ్యామసుందరి అక్క. ఎందరెందరినో వాళ్లు కలుసుకొన్నారు. కాని వేషం మాత్రం రాలేదు.

క్రమేణా, శ్యామసుందరి అక్క వేధించడం ప్రారంభించింది." ఎన్నాళ్ళు యిలా నిన్ను మేపడం ? ఎన్నాళ్లు నామంచి చీరలన్నీ నువ్వు కట్టుకుంటావు? నాకంటె చిన్నదానివీ అందమైన దానివీ.... నువ్వే సంపాదించుకోవచ్చునుగా ?" అంటూ ఏమేమిటో సలహాలిచ్చేది. ఆసలహాలని అర్థం చేసుకో డానికి ఎంతోకాలం పట్టలేదు సరస్వతికి.

ఆరోజు శ్యామ సుందరి అక్క చాలా హుషారుగా వుంది " నిన్ను బుక్ చెయ్యడానికి డైరెక్టరు గారు వస్తున్నారు! నీకదృష్టం అంటూ పట్టేయోగం వుంటే యీ ఛాన్సు ఒదులుకోకు " అంటూ హెచ్చరించింది సరస్వతిని.

నిజంగానే సరస్వతి ఆ ఛాన్సు వదులుకో దల్చలేదు. డైరెక్టరు తలనెరసిన వ్యక్తి.... చీరలు కొనుక్కోమని ఏభయి రూపాయలిచ్చాడు. ఆరోజున తెలిసింది — యీ ధన సంపాదన ఎంత సులభమో. కాని పుట్టిన పుట్టుక వల్ల యీ జీవితం, నీతివంతం యిలా జీవించడం తప్పు లేదు, అనితన ఆత్మను మాత్రం సంతృప్తి పరచు కోలేక పోయింది. కాని ఏంచేస్తుంది ? కొద్ది రోజులకే డైరెక్టరు గారి ధర్మమా అని ఓచిన్న వేషం దొరికింది. సినిమా ప్రపంచంలో సరస్వతి పేరు అందరికీ తెలిసింది కాని స్టూడియోకి వెళ్లినప్పుడు ఆలైటు బోయి లెంపు కలా పళ్లికిలిస్తారు ? మేకప్ మేన్ వేళాకోళా లాడ తాడేమిట ? కవిగారి చనువుకి అంతు లేదేమిటి ? .... అన్నీ తెగని సమస్యలై సరస్వతిని వేధించేవి.

మద్రాసులో జీవం సాఫీ గానే నడిచి పోతున్నట్లు కనిపిస్తున్నా సరస్వతి లోలోన కుళ్లి కృశించి పోతుంది. జీవితంలో తను మురిసిన తన అందం తనకే యింత చేటు తెస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. తాను జీవితంలో కాదలచిన దేమిటి ? అయిన దేమిటి ? ఇంకెన్నాళ్ళు యిలాబ్రతికితే తను తార అవుతుంది ? ఈ కోర్కెతో వచ్చిన తనలాంటి వాళ్లందరూ యిలాగే రూపాంతరం చెందుతున్నారా ? ఈ ప్రశ్నలన్నీ సమాధానం లేనిప్రశ్నలని తెలుసు తనకి కాని. యీప్రశ్నలు వేసుకోని రోజంటూ లేదు.

సంవత్సరం పూర్తి కాకుండానే సరస్వతికి యీ జీవితం మీద విసుగు వేసింది. తను మళ్లీ పోతే ; ఈ ఆలోచన కొద్ది రోజులుగా ఆమెకి నిద్రరాకుండా చేస్తూంది. అపజయాన్ని అంగీకరించి తను తిరిగి వెళ్లి పోతేనేం ?.... అరోజే తిరిగి వెళ్లి పోడానికి నిర్ణ యించుకొని శ్యామ సుందరి అక్కకి చెప్పింది సరస్వతి. తక్షణమే మెళ్లో గొలుసూ చేతిగాజులూ తీసు కొంది ఆవిడ. " ఎందుకు? యివన్నీ నావే కదూ?" అమాయికంగా అడిగింది సరస్వతి.

" నీవేం కావు. ఇన్నాళ్లూ నాయింట్లో వుండి నీ ఆటలు సాగించావే. నాకేం లాభం ?" శ్యామ సుందరి అక్క యిచ్చిన సమాధానం అది.

తను వూరుకి టిక్కట్టు కొనుక్కొని ఆడ వాళ్ల పెట్టెలో కూర్చున్న సరస్వతికి అసలు జీవితం మీదే విరక్తి కల్గింది. ఆడదిగా వున్నన్నాళ్లూ యీ లోకంలో ఏకాకిగా ఏ ఆడదీ బ్రతక లేదు. అలా బ్రతుకుతే బ్రతుక ప్రయత్నిస్తే తనకి తనే శత్రు వవుతుంది. ఈ నిజాన్ని తెలుసు కొందుకు సరస్వతికి తన జీవితాన్ని నాశనం చేసుకోవలసి వచ్చింది. కన్నీళ్లతో కూర్చున్న సరస్వతిని చూసి ఏదో కష్టం వచ్చింది కాబోలని ఓదార్చారు తోటి ప్రయాణీకులు. వారి ఓదార్పు మరీ బాధించింది సరస్వతిని.

శ్యామ సుందరి అక్క అను కుంటుంది సరస్వతి ఏ గొప్ప వాణ్ణో చూసుకొని లేచిపోయి వుంటుందని; అలా కాకుంటే రైల్లోనే ఏవ్యక్తినో చూసుకుని గమ్యం చేరకుండానే దిగిపోతుందని; లేకుంటే గమ్యంలో దిగ కుండానే అలా ఎక్కడికో వెళ్లి పోతుందని; కాని, అంత మంది మధ్య కూర్చుని ఏకాంతంగా కూర్చుని కుమిలి పోతూన్న సరస్యతి మనోభావాలని ఎవరు అర్థం చేసు కొంటారు. ఆమెలో జరుగుతున్న సంఘర్షణ, ఆమెకు మతిపోతున్న పశ్చాత్తాపం ఎవరికి అర్థం అవు తుంది ?

ఇప్పుడు, ఆడవాళ్ల పెట్టెలో కళ్ల నీళ్లతో కుములు తున్న హృదయంతో కూర్చున్న సరస్వతి ప్రాక్షాళిత అహల్య. ఆమెనికమీదట ఏపాపం అంటదు. ఇక ఏస్సై తానూ ఆమెని భ్రమింపచేయ లేదు. ఈ ప్రపంచంలో యింకేదీ ఆమెను పాపపథాన పడవేయలేదు .... రైలు నడక తోపాటే పాప పంకిల జీవితానికి క్షణక్షణం దూర మయిపోయింది సరస్వతి. తారాపథాన్నందుకో ఆశించిన సరస్వతి.

సరస్వతి పరిస్థితుల బానిసగా ప్రవర్తించింది, ఆశయా నికి దాసోహంచేసింది. ఆశయాలు తారకల నంటుతే, వాటి తోపాటే తారకలను చేరలేక, ఆసంగతి తెలుసుకో లేక జీవితాన్ని నాశనం చేసుకొన్న వ్యక్తిని అసహ్యించు కోలేం: జాలిపడతాం. అంతే. ఆలోచించి చూస్తే యీ పట్టణంలో సరస్వతిలో పరిపక్వన రాక. అటువంటిది ఒక ఆత్మ అనేది లేక ముకికి ముకికిగా కళ్లు మూసుకుని జీవితాన్ని సాగిం చేస్తూన్న సరస్వతులు ఎందరుంటారో ?

అందరూ నడిచే దారి తప్పి, కొత్తమార్గాన నడువ ప్రయత్నిస్తే అంతే అవుతుంది అంటారు కొందరు. కాని ఏమో అలాగనీ అనలేం, నుదుటి రాత ఎలావుంటే అలా జరుగుతుంది. మనం అలా కాకూడదని అనుకొన్నా తప్పదు. వ్యక్తుల జీవితాలు ముల్లు పడ్డ దారాల్లా కాక తప్పదు — ఎంతసాఫీగా జరిపేద్దామనుకున్నా అలాకాక తప్పదు — దానికి నిదర్శనే — సరస్వతి కథనం;


ఆంధ్ర మహిళ ప్రచురణలు

—— :o: ——

## ఏకాంకికలు

రచన: శ్రీ బుద్ధవరపు నాగరాజా మాత్యుడు

క్రౌన్‌సైజ్ — 250 పేజీలు          చదువుటకింపగు 7 చక్కటి నాటికలు.

## విడదీసే రైలుబళ్లు

[కథల సంపుటి]

రచన: శ్రీమతి. కె. రామలక్ష్మి.

ఆంధ్ర మహిళా ముద్రణాలయము, ఆంధ్ర మహిళాసభలో ముద్రింపబడినవి.